

ఎస్‌సి కమ్యూనిటీ హాలు పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని పూలపల్లి ఈదావారిపేటలో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ హాల్‌ను, రూ.పది లక్షలతో నిర్మించిన ఒసి కమ్యూనిటీ హాల్‌ను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. అలాగే పూలపల్లి కుళాయి చెరువు వద్ద కాలనీవాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గాంధీ భగవన్‌రాజ్, యునికల నాగేశ్వరరావు, గోనేడి రామకృష్ణ, గుబ్బల ప్రసాద్, నున్నబోయిన నాగరాజు, గుబ్బల సత్యనారాయణ ఉన్నారు.



కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

ఆర్‌టిసి బాదుడు..!

ముగిసిన దసరా ఉత్సవాలు
తిరుగు ప్రయాణమవుతున్న జనం
అధిక బస్ ఛార్జీలతో ప్రయాణికుల అవస్థలు
సామాన్యుడిపై పెను భారం



ప్రజాశక్తి - ఆచంట

దసరా పండుగ వచ్చి వెళ్లింది. పండుగ నిమిత్తం గ్రామాలకు వచ్చిన వారు పట్టణాల బాట పడుతున్నారు. అయితే ఛార్జీల మోతతో ప్రయాణం ప్రజలకు పెను భారంగా మారింది. దూర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారంతా స్వగ్రామాలకు వెళ్లడానికి ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే వీరికంటే ముందే ఆర్‌టిసితో పాటు ప్రయివేటు ట్రావెల్స్ నిర్వాహకులు ఛార్జీల రూపంలో నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. సాధారణ రోజుల్లో కంటే దసరా, దీపావళి, సంక్రాంతి వంటి పండుగ సమయాల్లో ప్రయాణికుల రద్దీని ముందుగానే అంచనా వేస్తూ ప్రయాణికులపై భారం మోపుతున్నారు. ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు కూడా మామూలు రోజుల కంటే నాలుగు రెట్లు అధికంగా టిక్కెట్లు ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణం అంటేనే దడ పుట్టించేలా చేస్తున్నాయి. అయితే రవాణా శాఖ అధికారులు మాత్రం కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

బాదుడే బాదుడు..

జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఎక్కువగా ప్రయాణికుల రద్దీ ఉంటుంది. ప్రస్తుతం దసరా పండుగ అయిపోవడం, విద్యాసంస్థలకు సెలవులు కూడా ముగియడంతో జిల్లా నుంచి హైదరాబాద్‌కు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారు. భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, కొవ్వూరు ప్రాంతాల నుంచి ప్రయివేట్ బస్సులు ఎక్కువగా నడుపుతున్నారు. ఈ తరహాలో వేరే దారిలేక ప్రయాణికులు వారి అడిగినంత చెల్లించి ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఛార్జీలు చూసి ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా జిల్లా నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించడానికి సాధారణ రోజుల్లో టిక్కెట్ ధర దూరాన్ని బట్టి రూ.600 నుంచి రూ.700 వరకూ ఉంటుంది. ప్రస్తుతం దసరా పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఒక్కో టిక్కెట్ ధర రూ.1200 నుంచి రూ.2 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధమైనా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. చేసేది లేక అడిగినంత ఇచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయివేటు బస్సుల స్థాయిలో కాకపోయినా ఆర్‌టిసి కూడా ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ముఖ్యంగా రద్దీని బట్టి ఆ సంస్థ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసి ఛార్జీలను కూడా ప్రత్యేకంగా వడ్డిస్తోంది. దీంతో ఆర్‌టిసి ప్రయాణం కూడా ప్రయాణికులకు భారంగా మారుతుంది. వివిధ రకాల సర్వీసులను నడుపుతున్న ఆర్‌టిసి ఛార్జీలను కూడా ఒక్క విధంగా వసూలు చేస్తూ ప్రయాణికులను నట్టేట ముంచుతున్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలి సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తాడేరు గ్రామంలో స్మార్ట్ మీటర్లను ఆదిలోనే వ్యతిరేకించాలని కోరుతూ మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ, షాపునకు స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలిపారు. ప్రతి కనెక్షన్‌పై 13000 రూపాయలు ప్రజలే చెల్లించాలని అంటోందని తెలిపారు. ఒకేసారి చెల్లించాలంటే ప్రజలు వ్యతిరేకిస్తారని 10 సంవత్సరాలపాటు నెలకు 150 రూపాయలు చొప్పున వసూలు చేయడానికి పూనుకుంటోందన్నారు. స్పాట్ మీటర్లు తయారు చేసే కంపెనీ అదానికి అప్పజెప్పిందన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే గనుక ముందు డబ్బు చెల్లించి కరెంటు వినియోగించుకునేలా సెల్ ఫోన్ మాదిరిగా ప్రీపెయిడ్ పద్ధతి కూడా వస్తుందని తెలిపారు. ప్రజలపై పెనుభారం మోపే స్పాట్ మీటర్లు ఆదిలోనే వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, తాతారావు, రాంబాబు పాల్గొన్నారు.

ఆసుపత్రుల రాకతో వైద్య పరంగా 'గూడెం' అభివృద్ధి

డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొత్త ఆసుపత్రుల రాకతో తాడేపల్లిగూడెం వైద్యపరంగా ఎంతో అభివృద్ధి సాధిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో డాక్టర్ నూకల మహిధర్ నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సిద్ధార్థ హాస్పిటల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనరల్ సర్జన్ నిపుణులు కొరత ఉన్న ప్రస్తుత తరుణంలో పట్టణంలో జనరల్ సర్జన్ లాప్రోస్కోపిక్ సర్జరీలో నిపుణులైన డాక్టర్ నూకల మహిధర్ సిద్ధార్థ హాస్పిటల్ నెలకొల్పడం శుభపరిణామమన్నారు. ఎవరి రంగంలో వారే ప్రత్యేకతలతో కూడిన నైపుణ్యంగా వైద్య సేవలు అందిస్తే మరింత రాణించవచ్చన్నారు. తద్వారా డాక్టర్ల మధ్య మంచి ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడుతుందన్నారు. రోగులు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే వైద్యం అందేలా వివిధ విభాగాల డాక్టర్లు సమిష్టి కృషి చేయాలన్నారు. వైద్యులు ఒకరికొకరు అంతర్గత సహకారం అందించుకోవాలన్నారు. ఇటీవల వస్తున్న ఆసుపత్రులు ఆధునిక సదుపాయాలతో, నిపుణులైన వైద్యులతో ఏర్పాటవుతున్నాయని, దీనివల్ల రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. దశాబ్దాల తరబడి ఉన్న ఆసుపత్రులు వైద్యులు నేటి ఆధునిక యుగంతో వివిధ కారణాల రీత్యా పోటీ పడలేక వెనుక పడుతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తగా ఆసుపత్రులు రావడం, నిపుణులైన డాక్టర్లు అందుబాటులోకి రావడం, రోగులు వైద్య సేవలు పొందడంలో మరింత వెసులుబాటు కల్పిస్తోందన్నారు. వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ, 108, 104 వాహనాలు, వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న పథకాలతో ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల చెంతకు తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు, హోంమంత్రి వనిత

అందుబాటులోకి వైద్య సేవలు : హోంమంత్రి వనిత

ఆసుపత్రులు పెరగడం ద్వారా వైద్య సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. సాయి సిద్ధార్థ హాస్పిటల్స్ భవనం మొదటి అంతస్తులో విభాగాలను డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా ఖరీదైన వైద్య రంగంలో ఆసుపత్రులు పెరగడం ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. డాక్టర్ నూకల మహిధర్ ఈ హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి సంజీవని హాస్పిటల్ అధినేత డాక్టర్ పుప్పాల మురళీకృష్ణ, పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ తానేటి శ్రీనివాసరావు, డాక్టర్ వి.రమాదేవి, డాక్టర్ యడ్లపాటి భవాని, పలువురు డాక్టర్లు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కర్ రావు, ఆరేటి ప్రకాష్, సీనియర్ జర్నలిస్టు కె.రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దిరాజు

బీచ్ వద్ద పటిష్ట చర్యలు చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంబీచ్‌లో పర్యాటకుల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేరుపాలెం బీచ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, నలుమూలల నుండి పర్యాటకులు వేల సంఖ్యలో తరలివస్తున్నారని అన్నారు. పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యాటకుల రక్షణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీర పాండురంగారావు యడ్ల చిట్టిబాబు, కొత్త విజయకుమార్, కొత్తపల్లి నాగరాజు, ఆదూరి సాంబమూర్తి, మువ్వల రాజారావు పాల్గొన్నారు.

నేడు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 25 బుధవారం ఉదయం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 ఏళ్ల లోపు వయసు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు. వసుధ ఫౌండేషన్, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్, మానవత స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొని వైద్య సహాయం అందిస్తాయన్నారు. వివరాలకు, ఇతర సమాచారం కోసం 9949093115, 9440859700, 6300180993, 9494338086 సంప్రదించాలని ప్రసాదరాజు తెలిపారు.



దాండియా నృత్యం చేస్తున్న ఎంఎల్‌ఎ శ్రీనివాస్

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవాలి

దాండియా నృత్యం చేసిన ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పట్టణ మార్వాడి సమాజ్ వారి ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమానికి గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు మన సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేసే విధంగా మార్వాడీలు ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా మార్వాడీ సమాజ నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మార్వాడీ సమాజ సభ్యులతో కలిసి రాజస్థానీ సాంప్రదాయమైన దాండియా నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, వైసిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, జైన్ యూత్ సంఘం నాయకులు హష్మక్ లాల్ జైన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవన్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు ప్రకాశం చౌక్, వెంకట రామ థియేటర్, తహశీల్దార్ కార్యాలయం, పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్, మావుళ్లమ్మ గుడి వీధి మీదుగా సాగింది.

అసైన్డ్ అన్యాక్రాంతం..!

పెద్దల చేతుల్లోనే పేదల అధికశాతం భూములు
జిల్లాలో 63,220 ఎకరాలు పంపిణీ
మొత్తం 54,682 మంది లబ్ధిదారులు
ప్రస్తుతం భూముల్లో ఉన్న లబ్ధిదారులు నామమాత్రమే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. భూములు పొందిన లబ్ధిదారుల చేతుల్లో ప్రస్తుతం ఉన్న భూములు నామమాత్రంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వం చేసిన అసైన్డ్ చట్టంలోని మార్పులతో వేలాది ఎకరాల పేదల భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. 20 ఏళ్లక్రితమే అసైన్డ్ భూములకు బి-ఫారం పట్టాలు పొందిన వాస్తవ లబ్ధిదారులు, వారసుల స్వాధీనంలోకి అసైన్డ్ భూములపై పూర్తిహక్కులు కల్పిస్తామని చెబుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ క్రమంలో పంపిణీ చేసిన భూములు ఎవరిస్వాధీనంలో ఉన్నాయో నిర్ధారించేందుకు రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. ఇప్పటి వరకూ జరిపిన పరిశీలనలో భూముల లెక్కలు, లబ్ధిదారుల లెక్కలు తెల్చిన అధికారులు, అవి ఎవరిస్వాధీనంలో ఉన్నాయో తేల్చేపనిలో నిమగ్నమయ్యారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మూడొంతులకు పైగా పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్‌భూములు పెద్దల చేతుల్లోకి చేరిపోయినట్లు తెలిసింది. ఏలూరు జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 27 మండలాలున్నాయి. 2003కు ముందు పంపిణీ చేసిన అసైన్డ్‌భూములు ఏలూరు డివిజన్‌లో 19,575 ఎకరాలు ఉండగా లబ్ధిదారులు 19,390 మంది ఉన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో 23,051 ఎకరాలు భూమి పంపిణీచేయగా 15,536 మంది లబ్ధిదారులున్నారు. నూజివీడు డివిజన్‌లో 20,595 ఎకరాల అసైన్డ్‌భూమి పంపిణీ చేయగా 19,756 మంది లబ్ధిదారులున్నారు. ఏలూరు జిల్లామొత్తంగా 63,220.5 ఎకరాలు భూమి పంపిణీ జరగ్గా మొత్తం 54,682 మంది లబ్ధిదారులకు ఇచ్చినట్లు లెక్కతేలింది. ఇంత పెద్దమొత్తంలో పేదలకు భూమి పంపిణీ జరిగినప్పటికీ ప్రస్తుతం మాత్రం పేదల చేతుల్లో ఆ భూములు లేకుండా పోయాయి. మూడొంతులకు పైగా భూమి బడాబాబులు చేతుల్లోనే ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. నిబంధనల ప్రకారం అసైన్డ్, సీలింగ్ వంటి భూములకు సంబంధించి క్రయవిక్రయాలు చెల్లవు. ఈ భూముల పంపిణీ కోసం సిపిఎం వంటి వామపక్ష పార్టీలు జిల్లాలో అలుపెరుగని పోరాటంచేసిన ఉదంతాలున్నాయి. పేదల అసహాయాతను అసరాగా చేసుకున్న గ్రామాల్లోని పెద్దలు పది, పరక చేతిలో పెట్టి పేదల భూములను స్వాధీనం చేసుకుని స్వేచ్ఛగా అనుభవిస్తున్నారు. చేపల చెరువులు తవ్వేసి పెద్దఎత్తున ఆదాయం గడిస్తున్నారు.

మెట్టప్రాంతంలో పామాయిల్ వంటి పంటలను పండిస్తున్నారు. తమభూములు తమకు ఇవ్వాలని పలుచోట్ల పేదలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు. దెందులూరు మండలం దోసపాడు గ్రామంలో దళితులకు చెందిన దాదాపు 155 ఎకరాల అసైన్డ్ భూమిని విజయవాడకు చెందిన బడాబాబులు సొంతం చేసుకుని చేపలచెరువులు తవ్వేసి అనుభవిస్తున్నారు. తమభూములు తమకు ఇవ్వాలంటూ దళితులు పోరాటం చేస్తూనే ఉన్నారు. టి.నరసాపురంతో పాటు పలు మండలాల్లో భూపోరాటాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అసైన్డ్ చట్టంలో చేసిన మార్పులు బడాబాబులకు అనుకూలంగా ఉండటంతో పేదల భూములు పెద్దలపరమయ్యే పరిస్థితి నెలకొందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే పంపిణీచేసిన అసైన్డ్ భూములన్ని పట్టాదారులులకు, లేదావారి వారసులకు అందించాలని అంతా కోరుతున్నారు. ప్రభుత్వం ఏ విధంగా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.

జిల్లాలో పంపిణీ చేసిన అసైన్డ్ భూమి మొత్తం : 63,220 ఎకరాలు
లబ్ధిదారులు సంఖ్య : 54,682
డివిజన్ల వారిగా వివరాలు

డివిజన్	ఎకరాలు	లబ్ధిదారులు
ఏలూరు	19,575	19,390
జంగారెడ్డిగూడెం	23,051	15,536
నూజివీడు	20,594	19,756



18వ వార్డులో టాంకర్ వద్ద మహిళలు పడుతున్న బాధలు చూస్తున్న ఎంఎల్‌ఎ రామానాయుడు

పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఎంఎల్‌ఎ నిమ్మల ఆదేశం


ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని 18వ వార్డులోని ఎస్‌సి ఏరియాలో పాడైన తాగునీటి పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి, ఆ ప్రాంత వాసుల దాహార్తిని తీర్చాలని మున్సిపల్ అధికారులను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆయా ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక 20 రోజులుగా తాగునీటి పైప్‌లైన్ పాడైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణం రోజుకు రెండు సార్లు తాగునీటి ట్యాంకర్ ద్వారా ప్రజలకు నీరు అందించాలని మున్సిపల్ కమిషనర్ శేషాద్రిని ఆదేశించారు. వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతులు డిమాండ్ చేశారు.

27న బాల బాలికల స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023-24 సంవత్సరానికి బాలబాలికల అండర్-14, 17 విభాగాల్లో ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 27, 28 తేదీల్లో ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ మల్లేశ్వరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో ఖోఖో, చెస్, 28న వాగల్లు మండలం బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


ఆర్థిక సాయం అందిస్తున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ

అనారోగ్య బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు


పాలకొల్లు 18వ వార్డులో గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హాండ్స్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ కువైట్ వారి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కటకం వెంకట కల్యాణ్ గుప్తాకు రూ.45 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇతనికి చిన్న వయసులోనే బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. ఈ విషయాన్ని ఫౌండేషన్ ట్రెజరర్ బొంద ప్రభావతి దృష్టికి తీసుకెళ్లారు. కల్యాణ్‌కు మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సహాయం చేయాలని కమిటీ పెద్దలను బొంద ప్రభావతి కోరడంతో ప్రభావతి ఫౌండేషన్ తరఫున రూ.10 వేలు, ప్రభావతి, ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు కలిసి రూ.35 వేలు, మొత్తం రూ.45 వేల ఆర్థిక సహాయాన్ని వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ చేతులమీదుగా అందించారు. బొంద పార్థసారధి మనవడు సర్వేశ్వర్ పుట్టినరోజు సందర్భంగా పాలకొల్లు శాస్త్రి చిల్డ్రన్స్ హోంలో కేక్ కట్ చేసి చిన్నపిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ఖండవల్లి వాసు, కొండేటి రావు, మధు పాల్గొన్నారు.


కోమటిగుంటలో తెప్పోత్సవం

ఘనంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కోమటిగుంటలో దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ ఆలయంలో రామాలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. పూలు, పండ్లతోను, విద్యుత్ కాంతులతో అలంకరించిన హంస వాహనంలో అమ్మవారికి కనులు విందుగా తెప్పోత్సవం నిర్వహించారు. మేళ తాళాలు బాణసంచా కాల్పుల మధ్య అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు యలమంచిలి వెంకటరమణ, యలమంచిలి రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు గుర్రం వెంకట సత్యనారాయణ, పులమంతుల ఏసురాజు, మంతెన నాగఆంజనేయులు, యలమంచిలి బాబ్జి, కాపుశెట్టి సత్యనారాయణ, యలమంచిలి గణపతి పాల్గొన్నారు.


నాగరాజును సత్కరిస్తున్న మాజీ సర్పంచి శ్రీనివాసరావు

సీసలిలో నాగరాజుకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని సీసలి గ్రామంలో లక్ష్మి దుర్గాలయంలో విజయదశమి సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అమ్మవారిని మంగళవారం దర్శించుకున్నారు. మాజీ సర్పంచి కర్రేడ్డి శ్రీనివాసరావు జుత్తిగ నాగ రాజును సత్కరించి జ్ఞాపక అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీసలి గ్రామ అధ్యక్షులు నూకల భోగేంద్ర బాబు, ఆలయ కమిటీ సభ్యులు, భవానీలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎంఎల్‌ఎ గ్రంధి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా శ్రీశ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి అలంకరణలో ఉన్న శ్రీ మావుళ్లమ్మను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, పాలకవర్గం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత విఘ్నేశ్వరుడిని పూజించిన ఆయన, అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

రానున్న ఎన్నికల బరిలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ

ప్రజాశక్తి - భీమవరం

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు లంక కృష్ణమూర్తి అన్నారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా సమితి సమావేశం భీమవరంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి దండు శ్రీనివాసరాజు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని సుభాష్ చంద్రబోస్ 1939లో స్థాపించారన్నారు. 25 రాష్ట్రాల్లో ఈ పార్టీ ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల క్రితమే పెట్టినట్లు చెప్పారు. తెలంగాణ ఎన్నికల్లో దాదాపు వంద సీట్లలో పోటీ చేస్తుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కూడా సుమారుగా 50 సీట్లలో పోటీ చేయాలని రాష్ట్ర సమితి నిర్ణయించిందన్నారు. నవంబర్‌లో జిల్లా మూడు డివిజన్ల మహాసభలు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో కనుమూరు వెంకటపతిరాజు, తిరుమణి, వనమరాజు, దుగ్గిరాల శ్రీనివాస్, వాటాల కోటేశ్వరరావు, కె.రాంబాబు, కొత్తపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

జగన్నాధపురంలో పెంకుటిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని జగన్నాధపురం పప్పుగుంట వీధిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పప్పుగుంట వీధికి చెందిన ప్రభావతి రెండు రోజుల క్రితం తన కుమార్తె ఇంటికి వేరే గ్రామం వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పెంకుటిల్లు దగ్ధమైంది. ఇంట్లోని విలువైన వస్తువులు, వంట సామగ్రి కలిపి దాదాపు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆర్ఐ కె.రాంబాబు తెలిపారు. తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, సర్పంచి గుడాల శిరీష చంటి, ఆర్ఐ కె.రాంబాబు, విఆర్ఒ రాపాక స్వామి పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో అంతర్గత రహదారులు

సర్వసభ్య సమావేశంలో ఎంపిపి వెంకటరామరాజు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని 18 ఆవుటలో రెండు కోట్లతో ఇంటర్నల్ రహదారులు నిర్మిస్తున్నట్లు ఎంపిపి దండు వెంకటరామరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ భవనంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అభివృద్ధికి నిధులు కేటాయించి డ్రైనేజీలు, రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాఖాధికారి వై.ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఇ క్రాప్ వంద శాతం పూర్తి చేశామన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి వరి కోతలు ప్రారంభమవుతాయని తెలిపారు. శాంపిల్స్ ఇచ్చిన రైతులు సంచులు అందిస్తామన్నారు. సెలవు రోజున సమావేశాలు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి మాట్లాడుతూ సమావేశం ఏర్పాటు చేసి 90 రోజులు కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో నిర్వహించామని చెప్పారు. ప్రభుత్వం 18 కులవృత్తులను గుర్తించి వారికి పిఎం విశ్వకర్మ పథకంలో బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచులు గ్రామాల్లో ఉన్న కుల వృత్తులు చేసుకునే వారు దరఖాస్తులు చేసుకునేలా ప్రోత్స హించాలన్నారు. బ్యాంకుకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా రూ.2 లక్షల వరకు రుణాలు అందిస్తుందని చెప్పారు. తొలుత ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా అమృత్ కలెక్షన్ యాత్ర ర్యాలీ నిర్వహించారు. 25 గ్రామాల నుంచి తీసుకొచ్చిన మట్టి ధాన్యం కలిసి ఉన్న కలశంతో ర్యాలీగా వెళ్లి స్వతంత్ర సమరయోధుల స్తూపం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కలశాలను ఢిల్లీ పంపిస్తున్నట్లు ఎంపిడిఒ జ్యోతిర్మయి తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.హరినాథ్‌రాజు, పంచాయతీరాజ్ జెఇ శ్రీనివాసరావు, సూర్యబలిజ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు దేవరపు సోమలక్ష్మి, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు చనుమూరి లక్ష్మీభవాని, వైస్ ఎంపిపి సలాది రత్నదుర్గాకుమారి, నెహ్రూ యువకేంద్రం కో-ఆర్డినేటర్ పి.వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరామరాజు

అప్సడ కో-వైస్ చైర్మన్ పదవీకాలం పొడిగింపు హర్షణీయం

రొయ్య రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద చంటి

ప్రజాశక్తి - పాలకోడేరు

స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడ) కో-వైస్ చైర్మన్ వడ్డి రఘురాం పదవికాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ మత్స్యశాఖ స్పెషల్ సిఎస్ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులిచ్చారు. వడ్డీ రఘురాం పదవీ కాలం పొడిగించడంపై జిల్లా రొయ్య రైతుల సంఘం ఉపాధ్యక్షులు మంతెన లక్ష్మీనరసింహరాజు (పెద్దచంటి) హర్షం వ్యక్తం చేశారు. కోరుకొల్లులో మంగళవారం నిర్వహిం చిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడరు. ఆక్వా కల్చర్ కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడ ంతో పాటు వాటికి చట్టబద్ధత కల్పించే లక్ష్యంతో అప్సడా చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అప్సడకు చైర్మన్‌గా సిఎం వ్యవహరిస్తున్నారన్నారు. సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతుల సంక్షేమం కోసం రెండేళ్లుగా రఘురాం చేస్తున్న సేవలను గుర్తించిన సిఎం జగన్ ఈ పదవికాలన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించడం అభినందనీయమన్నారు. కంపెనీలు పెంచిన ఫీడ్ ధరలను ఉపసంహరించుకునేలా కృషి చేయడంలో రఘురాం కీలకపాత్ర పోషించారన్నారు. ప్రతి 15 రోజులకోసారి రొయ్యల ధరల హెచ్చు తగ్గులను పర్య వేక్షిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి కృషి చేస్తు న్నారన్నారు. ఆక్వా రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తి ంచి పరిష్కరిస్తున్న సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఏనుగు ఊరేగింపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

దసరా సందర్భంగా పొలమూరులో ఏనుగును ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ సంబరం చేస్తుంటారు. ఇది దండు వారి వీధిలో వందేళ్ల క్రితం ప్రారంభించిన ఈ సంబరానికి ఓ ప్రత్యేకత ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది దసరా పండుగ రోజుల్లో చిన్న పిల్లలు రాత్రిపూట మట్టి ఏనుగు తయారు చేసి డప్పులు వాయిస్తూ ఊరేగించేవారు. చివరి రోజు దసరా పండుగ రోజున వాహనంపై ఏనుగును ఊరేగిస్తూ సంబరం చేస్తుంటారు.

నేడు సీజ్డ్ వాహనానికి వేలం

పెనుమంట్ర : ఈ నెల 25వ తేదీ బుధవారం పెనుమంట్ర పోలీస్‌స్టేషన్‌లో పల్సర్ బైక్‌కు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ షేక్ మదీనా బాషా తెలిపారు. ఎక్సైజ్ అధికారి సీజ్ చేసిన వాహనానికి ఎస్‌పి రవిప్రకాష్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


పోలియోపై అవగాహనా ర్యాలీ

పాలకొల్లు : ప్రపంచ పోలియో డే సందర్భంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పోలియోను నిర్మూలించడం రోటరీ లక్ష్యమని క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు అన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు పోలియో చుక్కలు వేసుకోవాలని, పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ నుంచి అధిక మొత్తంలో ఫండ్‌ని సేకరించి పోలీయో ఫండ్‌గా ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల ప్రదీప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్ మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, చందక రాము, ముత్యాల శ్రీనివాసరావు, షేక్ పీర్ సాహెబ్, ముచ్చర్ల సంజయ్, కటారీ నాగేంద్రకుమార్, రోటరీ సభ్యులు కానూరు ప్రభాకరరావు, శిరిగినీడి రాము పాల్గొన్నారు.

తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ చైర్మన్‌గా నందసాయి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక జగనన్న కాలనీలో తారకరామ కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ పళ్ల ఏసుబాబు ఆధ్వర్యంలో దసరా వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ప్రత్యేకంగా వాహన పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పళ్ల ఏసుబాబు తనయుడు పళ్ల తారక రామ నంద సాయి అయ్యప్ప తారకరామ కన్‌స్ట్రక్షన్స్ వైస్ చైర్మన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ తారకరామ మాట్లాడుతూ తన తండ్రి ఏసుబాబు సూచన మేరకు తారకరామ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వీలైనంత త్వరగా ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వైస్ చైర్మన్‌ను సన్నిహితులు, కుటుంబసభ్యులు, స్నేహితులు అభినందించారు. ఏసుబాబు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ తనకు అప్పగించిన పేదల ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. ప్రతి ఇంటిని పూర్తి చేసి వారికి అందించాలనే తపనతో నాటి నుంచి నిరంతరం నిర్మాణాల విషయంలో రాజీ పడకుండా పని చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల లబ్ధిదారులు ఎప్పటికప్పుడు తమ ఇంటి నిర్మాణాలను స్వయంగా చూసుకోవచ్చని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.


బాధ్యతలు చేపడుతున్న తారకరామనంద సాయి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - వీరవాసరం

కొణితివాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1991-92 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని దసర పండుగను పురస్కరించుకుని నిర్వహించుకున్నారు. కొణితివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా వీరు కలుసుకున్నారు. ఈ సందర్భంగా గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటూ హైస్కూల్ ప్రాంగణంలో గడిపారు. చివరిగా తమ ఉన్నత స్థితికి కారణమైన గురువులను జయరాజు, కామశాస్త్రి, నరసింహరాజు, శర్మలను సత్కరించారు. తొలుత మృతి చెందిన తమ గురువులైన బాపిరాజు, శ్రీరామరెడ్డి, నాటి మిత్రులు జవ్వాది రామకృష్ణ, నాగరాజు వర్మ, పడవల హరిబాబు, చీతిరేల సుబ్బారావు, తాడాల సుబ్బారావు, పార్శి మోహన్‌రావు, రామకృష్ణలకు సంతాపం వ్యక్తం చేశారు. ఈ అపూర్వ సమ్మేళనానికి నాగరాజు సుబ్బరాజు, వెలక్కాయల పార్థసారథి, చిక్కాల రవికుమార్, కురిశెట్టి శేషు, రామకృష్ణ కృషి చేశారు.

'ఎపి భవిష్యత్తు కోసమే టిడిపి, జనసేన పొత్తు'

ప్రజాశక్తి - కాళ్ల

ఎపి భవిష్యత్తు కోసం టిడిపి, జనసేన పొత్తు ఉంటుందని, విజయదశమి రోజున ఇరు పార్టీల నాయకులు సమావేశం కావడం మంచి పరిణామమని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. ప్రాతళ్లమెరక గ్రామంలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం, ఇంటింటికి మన రాంబాబు, బాబుతో నేను కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు మినీ మేనిఫెస్టోలోని పథకాల వివరాలు ఉన్న కరపత్రాలను, చంద్రబాబు అరెస్టు నేపథ్య వివరాలు ఉన్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరావు, తోట ఫణిబాబు, తెలుగు యువత మండల అధ్యక్షులు మంతెన రామరాజు, టిడిపి ప్రాతళ్లమెరక గ్రామ అధ్యక్షులు కంతేటి శ్రీనివాసరాజు, మహాశక్తి టీం సభ్యులు కొట్టు ఇందిర, లీలావతి, బోధనపు రత్నకుమారి, టి.గౌతమి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అరెస్టుపై టిడిపి భీమవరం నియోజకవర్గ ఆధ్వర్యంలో బాబుతో నేను కరపత్రాల పంపిణీ కార్యక్రమం భీమవరం టౌన్ గునుపూడి 12 అంబేద్కర్ నగర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, నాయకులు ఐజాక్ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని దగ్గులూరు గ్రామంలో టిడిపి మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ శగ సత్యనారాయణ జగనాసుర దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పిలుపుమేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు అందే వీరభద్రరావు, కలిదిండి రామచంద్రరాజు, కూర్మ సాంబయ్య పాల్గొన్నారు.

ఆచంట : అరాచక పాలనపై ప్రజల్లో మనోధైర్యాన్ని నింపేందుకు టిడిపి, జనసేన పార్టీలు ఉమ్మడి పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అరెస్టుపై నిరసనగా మంగళవారం 43వ రోజు దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఈ దీక్షలకు పితాని సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, పార్టీ మండల అధ్యక్షులు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి పాల్గొన్నారు.

పాలకొల్లు : టిడిపికి జనసేన మద్దతు ఇచ్చిన నాటి నుంచి సిఎం జగన్‌కు కంటిమీద కునుకు లేకుండా పోయిందని, అందుకే చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలు ఎక్కువయ్యాయని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 41వ రోజుకు చేరాయి. దీక్షల్లో గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మండెల త్రిమూర్తులు పాల్గొన్నారు.



కాళ్లలో..

మొగల్తూరు : చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణమని టిడిపి నాయకులు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో మంగళవారం టిడిపి నాయకులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, కొల్లాటి బాలకృష్ణ, పెంటయ్య, మూలస్వామి, బంధన వడ్డీకాసులు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఐక్యత అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

మాలవానితిప్ప చిన్న గ్రామమైన ఐక్యతతో గ్రామస్తులందరూ పార్టీలకతీతంగా కార్యక్రమాలన్నీ నిర్వహించడం అభినందనీయమని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని మాలవానితిప్పలో కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎంఎల్‌ఎ మంతెన రామరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సాగిరాజు సుబ్బరాజు, మాజీ సర్పంచి మంతెన వెంకట్రాజు, మంతెన రంగరాజు, భవానీలు పాల్గొన్నారు.


ఎంఎల్‌ఎ రామరాజు సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ప్రగతి కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ తాడేపల్లిగూడెం ఏరియా జనరల్ బాడీ సమావేశం స్థానిక కోతి బొమ్మ సెంటర్ యూనియన్ అధ్యక్షులు బండి దుర్గాప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ గౌరవ అధ్యక్షులు ఐఎఫ్‌టియు నాయకులు దాన వరప్రసాద్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వృత్తిదారులకు జీవన విధానం చాలా కష్టంగా ఉందన్నారు. నిరంతరం విద్యుత్ పరికరాలతో జీవనం కొనసాగిస్తున్న తరుణంలో విద్యుత్ వల్ల ప్రాణహాని సంభవిస్తుందన్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఏ విధమైన సహాయ సహకారాలు అందకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వృత్తిదారులందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు బండి దుర్గాప్రసాద్, కార్యదర్శి చంద్రశేఖర్, పాండురంగారావు, వాసు, గంగాధర్, డి.రాము, వెంకటరమణ, మస్తాన్, చిన్న రాము, జె.శ్రీనివాస్,

నేడు మోగల్లులో గ్రామసభ

పాలకోడేరు : ఈ నెల 25వ తేదీన మోగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నట్లు విఆర్ఒ పంపన సురేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో రీ సర్వేకు సంబంధించి రైతుల పేర్లు చదువుతారని, హెచ్చు తగ్గులు ఉంటే సరి చూసుకోవాలని తెలిపారు.